క్లుప్తంగా

ఆర్జేడీపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాయలసీమ జిల్లాల ఇంటర్మీడియట్ ఆర్జేడీ రవి అవినీతిపై విచారించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఏఐఎస్‌యూ, పీఎస్‌వైఎఫ్, ఎన్‌డీఎస్‌ఎఫ్ నాయకులు జగదీష్, ఓబులేసు, నాగరాజు, రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వారు ఆర్జేడీ అవినీతి, అక్రమాలపై ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే నిరాహార దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్జేడీ రవి ఎయిడెడ్, ప్రభుత్వ లెక్చరర్ల, టైపిస్టు, కాంట్రాక్టు లెక్చరర్, జూనియర్ అసిస్టెంట్‌ల వద్ద నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు.

ఆవులను రోడ్లపైకి వదిలితే చర్యలు

ప్రొద్దుటూరు : ఆవులు, ఎద్దులను వాటి యజమానులు రోడ్లపైకి వదలడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలుగుతోందని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, ఎద్దుల యజమానులు వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన పేర్కొన్నారు. ఆవులను, ఎద్దులను రోడ్లపైకి వదిలితే ఏపీ మున్సిపల్ యాక్ట్ సెక్షన్ 254 ప్రకారం న్యూసెన్స్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

డీఎస్సీ కోచింగ్‌కు ఉచిత శిక్షణ

ఖాజీపేట : డీఎస్సీ కోచింగ్‌కు ఉచిత శిక్షణను సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఇవ్వనున్నట్లు ఏఎస్‌ఓ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన వారిని పరిశీలించి అందులో 50 మంది ఎస్సీలను, 50 మంది ఎస్టీలను గుర్తించి ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చీరెలు పంపిణీ



మహిళలకు చీరెలను అందిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సూపర్ బజార్ రోడ్డులో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మగ్గం, కుట్టు శిక్షణ కేంద్రంలో మంగళవారం సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి 200 మంది మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, ట్రైనర్స్ లక్ష్మీదేవి, దేవిక పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రొద్దుటూరు : పట్టణంలో మంగళవారం వర్షాల కారణంగా కాలువల్లో మురికి నీరు ప్రవహించకుండా చెత్తా చెదారం అడ్డు పడింది. స్థానిక గాంధీ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద ఉన్న ప్రొద్దుటూరు ఛానల్‌లో నీరు నిలబడకుండా పూడికతీత పనులు మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కమిషనర్ తెలిపారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

ప్రొద్దుటూరు క్రైం : మన శుభ్రమైన చేతుల్లోనే మన ఆరోగ్యం దాగి ఉందని వైద్యాధికారి డాక్టర్ హిమబిందు తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, తర్వాత, మల విసర్జన తర్వాత, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఆటలాడుకున్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

కాశినాయన : మండలంలోని బాలాయపల్లె, వరికుంట్ల, ఆకులనారాయణపల్లె గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిమెంటు రోడ్లు నిర్మించేందుకు భూమిపూజ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామసభల్లో ఆమోదించిన పనులకు భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. 30 పనులకు గాను రూ.1.75 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, ఉపాధి సిబ్బంది, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి

చాపాడు : ప్రజలు ఎలాంటి కక్షలు పెంచుకోకుండా గొడవలకు దూరంగా ఉండాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ పుల్లయ్య అన్నారు. మండలంలోని చిన్నవరదాయపల్లె, నక్కలదిన్నె గ్రామాలలో మంగళవారం రాత్రి ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో ఫ్యాక్షన్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామాలలో ఎలాంటి చిన్న చిన్న సమస్యలకు ఘర్షణలు పడి కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా సామరస్యంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో పోలీసులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలన్నారు.

భౌభౌలతో బెంబేలు

- చిన్న పిల్లలపై విరుచుకుపడుతున్న వీధి కుక్కలు
- బయటికి వెళ్లాలంటే జంకుతున్న జనాలు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

ప్రొద్దుటూరు క్రైం : అసలే వర్షాకాలం.. ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్న పిల్లలు కనిపిస్తే చాలు దాడికి తెగపడుతున్నాయి. అవసరాల నిమిత్తం పిల్లలు సమీపంలోని దుకాణాలకు వెళ్తుంటారు. అయితే కుక్కలు దాడి చేస్తున్న నేపథ్యంలో పిల్లలు బయటికి వెళ్లాలంటే జంకుతున్నారు. పాఠశాలలకు వెళ్లమన్నా భయంతో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో తల్లిదండ్రులు తోడుగా వెళ్లి పాఠశాలలో వదిలి పెడుతున్నారు. కొన్ని రోజులుగా కుక్క కాటు బాధితులు జిల్లా ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంతో పాటు మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురం మండలాల నుంచి కుక్కకాటు బాధితులు ఇంజక్షన్ (ఏఆర్‌వీ) వేయించుకోవడానికి జిల్లా ఆస్పత్రికి వస్తుంటారు. కొన్ని రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో కుక్క కాటు కేసులు ఎక్కువగా వస్తున్నట్లు ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు. ప్రొద్దుటూరులోని సంజీవనగర్, వివేకానందకాలనీ, శ్రీనివాసనగర్, మోడంపల్లె, మౌలానా ఆజాద్ కాలనీ, ఆర్ట్స్‌కాలేజీరోడ్డు, రూరల్ పరిధిలోని ఈశ్వరరెడ్డినగర్, పెన్నానగర్, భగత్‌సింగ్ కాలనీ, దొరసానిపల్లె, సోములవారిపల్లె, ఖాదర్‌బాద్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉన్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఈ ప్రాంతాల నుంచి అధికంగా కుక్క బాధితులు వస్తున్నారు. రెండు రోజుల క్రితం ఈశ్వరరెడ్డినగర్ నుంచే 15 మంది కుక్క కాటుకు గురయ్యారు. సంబంధిత అధికారులు వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వీటి నియంత్రణ లేకపోవంతో జనావాసాల మధ్య కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కొన్ని రోజుల క్రితం ఒక పిచ్చికుక్క గాంధీరోడ్డులోని పవర్‌హౌస్ రోడ్డు, మౌలానా ఆజాద్‌వీధుల్లోని ఐదుగురు చిన్నారులపై దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు.

జిల్లా ఆస్పత్రిలో క్యూ కడుతున్న కుక్కకాటు బాధితులు

కుక్కలు దాడి చేయడంతో గాయాలపాలైన వారు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రిలోని ఇంజక్షన్ విభాగంలో క్యూ కడుతున్నారు. ప్రతి రోజు సుమారు 30 కేసులు నమోదు అవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో 760 మందికి 128 ఏఆర్‌వీ వైల్స్ వేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. అలాగే ఏఆర్ఎస్ 15 మందికి వేశారన్నారు. అక్టోబర్ నెలలో ఇప్పటి వరకు 400 కేసులు వచ్చాయన్నారు. వీరికి 68 వైల్స్ ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. అలాగే 20 మందికి ఏఆర్ఎస్ వ్యాక్సిన్ వేసినట్లు వివరించారు. సాధారణంగా కుక్క కాటుకు గురైన వారికి ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేస్తారు, కాటు తీవ్రత ఎక్కువగా ఉన్నా, మెడ, తల, ముఖంపై కుక్కలు కరచి గాయం చేస్తే వారికి ఏఆర్ఎస్ ఇంజక్షన్ వేస్తామని వైద్యులు తెలిపారు.



గుంపులుగా ఉన్న వీధి కుక్కలు



ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకునేందుకు ఆస్పత్రికి వచ్చిన బాధితులు



కుక్క కాటుకు గురై వ్యాక్సిన్ వేయించుకుంటున్న బాలుడు

కుక్కకాటుకు గురైన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్క కరచిన వెంటనే మగ్గ తీసుకొని పై నుంచి ధారలా గాయంపై నీటిని పోయాలి. గాయమైన చోట సబ్బుతో 15 నిమిషాల పాటు శుభ్రంగా కడగాలి.
- గాయానికి ఎలాంటి కట్టు కట్టకూడదు. ఓపెన్‌గా ఉంచాలి.
- కుక్కకాటుకు గురైన వారు కొన్ని రోజుల పాటు మాంసాహారం తీసుకోకూడదు.
- కరచిన కుక్కను 10 రోజుల పాటు గమనించాల్సి ఉంటుంది. కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడాల్సిన అవసరం లేదు.
- వైద్యుల సూచన మేరకు వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలి. గాయానికి ఎప్పటికప్పుడు డ్రెస్సింగ్ చేయించాలి. ఏఆర్‌వీ వ్యాక్సిన్ మొదటి రోజు, 3వ రోజు, 7వరోజు, 14వ రోజున మొత్తం నాలుగు డోసులు వేయించుకోవాలి.
- కుక్క కాటుతో రేబిస్ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నాలుగు డోసులు పూర్తి అయిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

రేబిస్ వ్యాధి లక్షణాలు



- ప్రారంభంలో తల నొప్పి, గొంతునొప్పి, జ్వరంతో పాటు కాటు ఉన్న చోట జలదరింపు వస్తుంది
- అధిక లాలాజలం, మింగడంలో ఇబ్బంది, ఆందోళన, గందరగోళం, నిద్రరాకపోవడం
- కాళ్లు చేతులు పడిపోవడం, ఫిట్స్ రావడం, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం కనిపిస్తుంది.

కుక్కకాటును అశ్రద్ధ చేయొద్దు



కుక్క కరచిన వెంటనే గాయాన్ని సబ్బుతో బాగా శుభ్రం చేయాలి. జిల్లా ఆస్పత్రికి వచ్చి వైద్యుడిని సంప్రదించాలి. తర్వాత నాలుగు డోసులు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి. 24 గంటల పాటు ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారు.ఏ సమయంలోనైనా ఆస్పత్రికి రావచ్చు. నిర్లక్ష్యం చేయకుండా వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలి.

డాక్టర్ ఆనంద్‌బాబు, సూపరింటెండెంట్ జిల్లా ఆస్పత్రి, ప్రొద్దుటూరు

అమ్మ పేరుతో మొక్క నాటుదాం

ప్రొద్దుటూరు : భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటి పెంచాలని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు తెలిపారు. మంగళవారం వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో నెహ్రూ యువ కేంద్రం కడప వారి సహకారంతో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. సంస్కృతి స్వచ్ఛంద కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి , రూరల్ సీఐ బాలమద్దిలేటి, డాక్టర్ నరసింహా, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావులు అమ్మ పేర్ల మీద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు జి.రామాంజనేయరెడ్డి, ఎం.శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు



వెదురూరులోని పెన్నానది సమీపంలో గుంతలు తీయిస్తున్న పోలీసులు

చాపాడు: మండలంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మండలంలోని వెదురూరు గ్రామ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు తిరిగే దారులలో మంగళవారం జేసీబీ చేత గుంతలు తీయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పెన్నానది వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకూ ప్రభుత్వ కేటాయించిన ఇసుక రీచ్‌ల వద్ద నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలన్నారు.

ఉపాధి నిధులతో రోడ్లకు మహర్దశ

అట్లూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అన్ని గ్రామ పంచాయతీలలో సిమెంటు రోడ్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని మంగళవారం ముత్తుకూరులో రూ.19.6 లక్షలు, వేమలూరు పంచాయతీలో రూ.21.6 లక్షలు, కామసముద్రం పంచాయతీలో రూ.19.6 లక్షలతో సిమెంటు రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌బాబు, పీఆర్ డీఈ సూర్యనారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేమలూరులో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

పంచాయతీల అభివృద్ధికే పల్లె పండుగ

పోరుమామిళ్ల : గ్రామ పంచాయతీల అభివృద్ధికే పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. మంగళవారం పుల్లివీడు, రంగసముద్రం పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆ రెండు పంచాయతీల్లో రోడ్లు, మౌళిక వసతుల ఏర్పాటుకు ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమణారెడ్డి, పంచాయతీ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ముడుమాల పంచాయతీ సిద్దయ్యమఠంలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డుకు మంగళవారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి భూమి పూజ చేశారు. అలాగే ముడుమాల గ్రామంలో రూ. 5 లక్షలతో సీసీరోడ్డుకు అధికారులు భూమి పూజచేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఉపాధి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సిద్దయ్యగారిమఠంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజచేస్తున్న టీడీపీ నాయకులు

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

చాపాడు : మండల పరిధిలోని చాపాడు, అల్లాడుపల్లె గ్రామాలలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు నిర్మించేందుకు మంగళవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. చాపాడులోని మారెమ్మ తల్లి దేవాలయం వద్ద రూ.2.65 లక్షలు, హరిజనవాడలో రూ.2.10 లక్షలు, మండికి వెళ్లే దారిలో రూ.2.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు.అలాగే అల్లాడుపల్లె గ్రామంలో కూడా సిమెంట్ నిర్మాణాలకు భూమిపూజ చేసినట్లు ఎంపీడీఓ రామానుజం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మహబూబ్ బీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఉపాధి ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు అక్బర్, హర్షవర్ధన్‌రెడ్డి, కిరణ్, సలీం, రవి, గోసుల వీరారెడ్డి, వీరనారాయణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

బద్వేలు అర్బన్ : పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ బద్వేలు ప్రాంతీయ మండలాల మహాసభలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే ఏకైక మార్గం అన్నారు. పాలకులు విద్యారంగం పట్ల సవతి ప్రేమను చూపిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటి అమలుపై దృష్టి సారించడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జీఓను రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తున్నారని పేర్కొన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. అలాగే ఆర్థిక బకాయిల చెల్లింపుల పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచడం లేదని అన్నారు. సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, క్రిష్టఫర్, కృష్ణుడు, కంచిరెడ్డి, ఈశ్వరయ్య, సుబ్బరాజ, చక్రపాణి శ్రీనివాసులరెడ్డి, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

అట్లూరు : కాలానుగుణంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని మంగళవారం యర్రబల్లి, తంబళ్లగొంది గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తంబళ్లగొంది రైతు సేవా కేంద్రంలోని రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయంలో పాత పద్ధతులకు స్వస్తిపలికి కాలానుగుణంగా యాజమాన్య పద్ధతులను పాటించి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సందీప్, రైతులు పాల్గొన్నారు.

రూ.1.26 కోట్లతో అభివృద్ధి పనులు

గోపవరం : ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని ఏడు గ్రామ పంచాయతీల పరిధిలో రూ.1.26 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ఎం.రామనాథరెడ్డి తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బేతాయపల్లెలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన 22 పనులకు రూ.1.26 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ విజయమ్మ, ఈఓపీఆర్‌డీ హసీనా, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం

బద్వేలు అర్బన్ : ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్‌కలాం అని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌కలాం నీతి, నిజాయితీ, ఆయన జీవన విధానం, దార్శనీకతను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. రచయితగా, శాస్త్రవేత్తగా దేశానికి ఆయన చేసిన సేవలు భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిచ్చయ్య, ఉపాధ్యక్షులు లక్ష్మిరెడ్డి, శ్రీరాములు, సుబ్బరాయుడు, మహబూబ్‌బాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయసాధన కమిటీ ఆధ్వర్యంలో..

భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మహనీయుల ఆశయసాధన కమిటీ, ఆవాజ్ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైవీయూ పాలకమండలి సభ్యులు, కలాం సేవారత్న అవార్డు గ్రహీత కొండపల్లి చిన్నసుబ్బారావు, మహనీయుల ఆశయసాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బి.గురుమూర్తిలు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి రాష్ట్రపతిగా ఎదగడంలో ఎంతో కృషి దాగి ఉందన్నారు. ఆయన కృషి, పట్టుదలను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ.సత్తార్, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి వెంగలరావు, సి.వెంకటసుబ్బయ్య, స.హ.చట్టం రక్షణ వేదిక పట్టణ కన్వీనర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



బద్వేల్ అర్బన్: అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

అబ్దుల్‌కలాంకు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి నివాళి

పోరుమామిళ్ల : క్షిపణి శాస్త్ర విజ్ఞాన రంగంలో చిరస్మరణీయమైన సేవలు అందించిన భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాంకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఘన నివాళి అర్పించారు. అబ్దుల్‌కలాం 98వ జయంతిని పురస్కరించుకొని దేశ రక్షణ వ్యవస్థకు అణుశక్తిని జోడించిన మిసైల్ మ్యాన్ అబ్దుల్ కలాం అంటూ మంగళవారం ఆయన పేర్కొన్నారు. యువతకు కలాం ఇచ్చిన సందేశాలు స్ఫూర్తిదాయకంగా నిలచాయన్నారు. మానవత్వం, అసామాన్యమైన విజ్ఞానం, నిస్వార్థం, స్ఫూర్తివంతమైన నడవడిక కలాంను ఎల్లప్పుడూ స్మరించుకొనేలా ఉన్నాయన్నారు.



అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

బహుముఖ ప్రజ్ఞాశాలి కలాం

బహుముఖ ప్రజ్ఞాశాలి, మిసైల్ మ్యాన్, గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, అధ్యాపకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం 93 వ జయంతిని పురస్కరించుకొని ఫిజిక్స్ లెక్చరర్ వెంకట్రావు ఆధ్వర్యంలో కలాం చిత్ర పటానికి పూలు వేసి, అధ్యాపకులు, విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ పేపర్‌బాయ్ నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన కలాం పిల్లలకు అత్యంత ఇష్టమైన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారన్నారు. 'కలలు కనండి.. వాటిని నిజం చేసుకోండి' అంటూ యువతకు ఆయన ఇచ్చిన సందేశం ఓ ట్రెండ్‌సెట్టరన్నారు. భారతరత్న కలాంకు పిల్లల మీద ఉన్న ప్రేమను గుర్తించి ప్రపంచ దేశాలు అక్టోబర్ 15ను ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహారెడ్డి, పర్వీన్, నరసయ్య, గురమ్మ, రవిచంద్ర, సబిత పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

చాపాడు : రైతులు నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలని, దీని వలన అధిక దిగుబడి సాధించవచ్చని మండల అధ్యక్షుడు లక్షుమయ్య అన్నారు. మండలంలోని కుచ్చుపాప, చిన్నగురువలూరు గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయంలో సాగు ఖర్చులు అధికంగా పెరిగాయన్నారు. నిలకడ లేని ధరలతో రైతులు ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్నారన్నారు. దిగుబడి అధికంగా సాధిస్తేనే ఆర్థికంగా నిలదొక్కుంటారన్నారు. వ్యవసాయ అధికారులు సూచనల మేరకూ నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఏఓ మ్యాగీ మాట్లాడుతూ.. సాగు చేసిన పంటలకు చీడ పీడలు సోకగానే పురుగు మందులు పిచికారి చేసి పంటను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బారెడ్డి, వీఏఏ మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

వరిలో పొటాషియం వేసుకోవాలి

మైదుకూరు : వరిలో పొటాషియం ఎరువులను పైపాటుగా వేసుకోవాలని కడప కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.వీరయ్య అన్నారు. మైదుకూరు మండలం శివపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరిలో దుక్కిలో మాత్రమే భాస్వరం ఎరువులను వేయాలని తెలిపారు. ఎరువులను 20, 40 రోజులలో వాడాలని వివరించారు. ఏడీఏ కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న వరిలో వచ్చే చీడపీడలు నివారణ గురించి రైతులకు వివరించారు. అనంతరం పలు పంటలను అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు.



పొలం పిలుస్తోందిలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు, రైతులు



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

లింగారెడ్డిపల్లెలో పొలం పిలుస్తుంది

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిపంటలో యాజమాన్య పద్ధతుల గురించి వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ రైతులకు వివరించారు. వరి పంటను పరిశీలించి పంట పొట్టదశలో ఉందని, వర్షాలు పడటం వలన కాటుక తెగులు సోకే అవకాశముందన్నారు. దీని నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లేదా ప్రొపికొనజోల్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి వర్షం తగ్గిన తర్వాత పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వీఏఏ నాగరత్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ప్రైవేట్ మద్యం షాపులు ఏర్పాటుకు కసరత్తు

కొన్ని ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటును వ్యతిరేకిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు క్రైం : నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ మద్యం షాపుల ఏర్పాటుకు నిర్వాహకులు కసరత్తు ముమ్మరం చేశారు. లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వారు గదులను వెతుక్కునే పనిలో పడ్డారు. మంగళవారం రాత్రికి కూడా కొందరికి గదులు దొరకలేదు.

- ప్రొద్దుటూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 19 మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి. వాటిలో చాపాడు మండలంలో రెండు, రాజుపాళెం మండలంలో ఒకటి, ప్రొద్దుటూరు రూరల్ మండలంలో రెండు, ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలో 14 షాపులను ప్రభుత్వం కేటాయించింది. పట్టణంలో షాపులు దక్కించుకున్నవారు 41 వార్డుల పరిధిలో ఎక్కడైనా దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చు. దీంతో వ్యాపారానికి అనువైన ప్రాంతాల కోసం వ్యాపారులు అన్వేషణ చేస్తున్నారు. కాగా తమ ప్రాంతంలో మద్యం షాపులను ఏర్పాటు చేయొద్దంటూ వసంతపేట, సాయిబాబా కొట్టాలకు చెందిన మహిళలు మంగళవారం కడపలోని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ మేరకు వారు జేసీ అతిథిసింగ్‌కు వినతిపత్రం అందచేశారు. అలాగే మైదుకూరు రోడ్డులోని శ్రీనివాసనగర్‌కు వెళ్లే దారిలో వైన్ షాపు పెట్టవద్దంటూ ఆ ప్రాంత వాసులు ఆందోళన చేశారు.



తాత్కాలిక లైసెన్సులు జారీ

బుధవారం ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి. మద్యం షాపులు దక్కించుకున్న వారికి వారం తాత్కాలిక లైసెన్సులను జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల తర్వాత దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించి శాశ్వత లైసెన్సులను జారీ చేస్తామన్నారు. బడి, గుడి నిబంధనలను తప్పక పాటించాలని తెలిపారు. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమలు కానున్న నేపథ్యంలో.. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం షాపుల విధానం మంగళవారం రాత్రితో ముగియనుంది. దీంతో ప్రభుత్వ షాపుల్లో నిల్వ ఉన్న మద్యం సీసాల స్టాకుతో పాటు ఫర్నీచర్, ఇతర సామగ్రిని ఎక్సైజ్ అధికారులు రాత్రి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం నుంచి కొత్త ప్రైవేట్ షాపులకు మద్యం సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రొద్దుటూరులో అత్యధిక మద్యం షాపులను టీడీపీ నాయకులు, ఆ పార్టీ మద్దతు దారులే దక్కించుకున్నారు. ప్రొద్దుటూరు టీడీపీ నాయకులతో పాటు జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ నాయకులకు అధిక సంఖ్యలో మద్యం షాపులు దక్కాయి.